గురు చరణములను ఆశ్రయించి జీవించుట







సర్వం శ్రీసాయి

## గురు చరణములను ఆశ్రయించి జీవించుట

సమర్థ సద్గురు సాయిదేవుని చారణాలను ఆశ్రయించి ఎన్నో ఎన్నో ఫలితాలను పొందుతున్నాము. పొందిన వెంటనే మళ్ళీ ఏదైన ఫలితాన్ని పొందడం కొరకు మాత్రమే ఆశ్రయిస్తున్నాము.

ఈ భౌతిక జీవన విధానానంలో గురువు తప్ప మరొక స్థితిగతి లేదు అనేది అర్థమై, ఆచరించ గలిగితే అసాధ్యం అనేదే లేదు.

గురువు మన చేతిని పట్టుకోవాలని అంటే మనం మొదట అ అర్హతను సాధించుకోవాలి.

గురువు ఎప్పుడూ పరమ ప్రేమ స్వరూపమే.

అందులో సందేహం లేదు. ఎల్లప్పుడూ శిష్యుని అభ్యున్నతిని కోరుకునే వారు గురువు. అందులో ఎటువంటి సందేహం లేదు.

అయితే

గురువు ప్రసరించే ప్రేమ శక్తిని అందుకునే స్థాయి శిష్యునికి వుండాలి. అదెలా వస్తుంది?

గురువు మాత్రమే శిష్యులను ఉద్ధరించ గలడు అనే పరిపూర్ణ విశ్వాసాన్ని కలిగి వుండటమే ఆ స్థాయిని అందిస్తుంది. కానీ మనం ఏమి చేస్తున్నాం?

ఏదో ఒక సమస్య పరిష్కారానికి గురువును ఆశ్రయంచి ఉంటున్నాం. ఆ సమస్య తీరితే ఆ గురువు గొప్పవాడు. తీరకపోతే మరో గురువు. ఇలా మార్చుకుంటూ పోతున్నాము.

గురువు నీ సమస్యని ఖచ్చితంగా పరిష్కరిస్తారు. ఆ శక్తి గురువులో వుందని నువ్వు మనసా, వాచా, కర్మణా నమ్మాలి. అప్పుడే అది సాధ్యం అవుతుంది.

సేవాభావం వల్లనూ మరియూ సర్వస్వ శరణాగతి వల్లనూ గురువు ప్రసన్నుడు అవుతాడు.

కనుక శిష్యులు ఎప్పుడు గురువే సర్వస్వం అని నమ్మి అప్పుడే మన గురువు మన చేతిని పట్టుకుని నడిపిస్తారు.

మనలో నమ్మకం అచంచలంగా వుందా? లేదా?  అనే ప్రశ్నకి ఎవరికి వారే సమాధానం చెప్పుకోవాలి.

గురువు మార్గాన్ని చూపిస్తాడు…ఆ మార్గంలో నడవటం మన పని.

గురువు జ్ఞానాన్ని అందిస్తాడు…ఆ జ్ఞానాన్ని జీవితంలో భాగం చేసుకోవటం మన పని.

గురువు ప్రేమని ప్రసరిస్తాడు…ఆ ప్రేమని నీలో నింపుకోవడం మన పని.

గురువు దగ్గరకి వెళ్ళేటప్పుడు మన బుద్ధిని, మన తెలివితేటలను పక్కనపెట్టి వెళ్ళాలి. గురువుతో వాదన,తర్కం పనికిరాదు.

గురువు చెప్పే మాటలను చెవులతో వినడమే కాదు…మనసులో నిలుపుకొని ఆచరించే ప్రయత్నాలు చేస్తుండాలి. ప్రతి ప్రయత్నంలో గురువుయొక్క సహకారం తప్పకుండా లభిస్తుంది. గురువును నమ్మినప్పుడు కళ్ళు మూసుకొని, ఇతర చింతనలు లేకుండా నమ్మాలి.

గురువుకు మనలన్ని మనం సమర్పించుకోవడం అంటే నీ హృదయాన్ని పూర్తిగా తెరచి సమర్పించాలి. గురువు ఉపదేశాన్ని వినేటప్పుడు నోరు తెరవకుండా వినాలి. గురువును ఏదైనా కోరేటప్పుడు కొంగు చాచి ఆర్ధిస్తూ.... ఆర్తితో ..... నా గురువు నిరవేరుస్తారు అనే పూర్తి స్థాయి నమ్మకంతో అడగాలి.

ఇవన్నీ చేయగలిగితే గురువు మనవారు అవుతారు.

గురుకృప ఏ వ్యక్తినైనా కూడా గురు స్థానంలో నిలుపుతుంది. అయితే ఆ వ్యక్తి తనకు గురుత్వ స్థాయిని కోరుకొని చేశాడా? కానే కాదు. తన ఆత్మోన్నతి కోసమే చేస్తాడు. అది సఫలం అయినప్పుడు గురువే ఆ వ్యక్తిని తన పరికరంగా ఆయుధంగా లోకానికి సమర్పించి , ఆ వ్యక్తిని గురువుగా నిలుపుతాడు. తన పరికరంగా , తన బాధ్యతలను ఆ వ్యక్తి ద్వారా నెరవేరుస్తారు. (శ్రీ దత్తుడు – విష్ణుదత్తుని వలె )

మనం లౌకికంగా అత్యున్నత విద్యావంతుడివి కావచ్చు. కానీ గురువు ముందు అనుక్షణమూ  అక్షరాభ్యసం చేస్తూ ఉండాలి.

మనం సమాజంలో గురువు కన్నా ఉన్నత స్థాయిలో వుండవచ్చు. కానీ గురువు ముందు మనం కేవలం ఒక సేవకుడిగానే ఉండాలి.

మనం గురువు కన్నా అత్యధిక ధనవంతులం కావచ్చు. కానీ గురువు ముందు నిరుపేదగానే ఉండాలి.మనం గురువు కన్నా అధిక లౌకిక జ్ఞానం కలవాళ్ళమీ కావచ్చు. కానీ గురువు ముందు పరమ అజ్ఞానిగానే ఉండాలి.

ఈ లౌకిక విద్య గురువు ముందు నిరక్షరాస్యత గా మిగులుతుంది. సమాజంలో మన స్థాయి గురువు ముందు నిష్ప్రయోజనం గా మిగులుతుంది.

మన ధన సంపద అంతా గురు చరణ ధూళిని కూడా తాకలేదు.మన లౌకిక జ్ఞానం సమస్తం గురువు అలౌకిక జ్ఞానం ముందు గుడ్డి గవ్వకు కూడా పనికిరాదు. గురువు ఆమోఘ జ్ఞాన సంపన్నుడు.....గురువు స్థాయి ఇది అని చెప్పే శక్తి ఎవరికి ఉండదు.

ఈ విషయాన్ని మనస్సులో స్థిరంగా నిలుపుకో గలిగితే గురువు మన వాడు అవుతారు.

యే మనుష్యః మాం ఆశ్రితః!

తాన్ సర్వేష్యః కర్మ వినాశనః లభై!!

